‘గడప గడపకు మన ప్రభుత్వం’ సక్సెస్

- సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ బేష్
- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి





మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, హాజరైన వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ అభిమానులు

కమలాపురం : గడప గపడకు మన ప్రభుత్వం.. ఓ మంచి కార్యక్రమం అని, సచివాలయ, వలంటీర్ వ్యవస్థ బాగా పని చేయడం వల్లనే ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యాయని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సక్సెస్ కావడంతో ఆదివారం తిప్పలూరులోని ఏకేఆర్ కల్యాణ మండలంలో జేసీఎస్ కన్వీనర్, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ కృతజ్ఞత సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గట్స్ ఉన్న నాయకుడని కొనియాడారు. మీపై ఎంతో నమ్మకం ఉంచి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చారని, అయితే మీరంతా బాగా పనిచేయడం వల్లనే గడప గడపకు వెళ్లినపుడు పెద్దగా సమస్యలు రాలేదన్నా రు. మండలంలో దాదాపు 19వేల ఇళ్లను సందర్శించానని, ప్రజల నుంచి వచ్చిన సమస్యలను దాదాపు 95 శాతం వరకు పరిష్కరించానన్నారు. అధికారు లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారధులు పనిచేయడం వల్లనే ఈ కార్యక్రమం సక్సెస్ అయిందన్నారు. గడప గడపకు తిరిగితే ప్రభుత్వం ఇచ్చే రూ.20 లక్షల్లో సమస్యలు పరిష్కరించామని, పెద్ద సమస్యలు, జిల్లా, రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు.

ప్రతి సచివాలయాన్ని సందర్శిస్తా :

ఇక నుంచి రోజూ ఒక సచివాలయాన్ని సందర్శిస్తానని, ఇంకా ఎవైన సమస్యలుంటే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 15 మంది నియోజకవర్గాల్లోని అన్ని ఇళ్లను సందర్శించానని, అందులో నేను ఒకడినన్నారు. స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు కుప్పంకు కూడా తీసుకురానన్ని నిధులు మన ఎమ్మెల్యే కమలాపురంకు తీసుకువచ్చారన్నారు. మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పుల్లారెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, మైనార్టీ కమిషన్ మెంబర్ హిదాయత్, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డిలు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడంలో ఎమ్మెల్యే కృషి అభినందనీయం అన్నారు. ముచ్చటగా మూడో సారి కూడా మన ఎమ్మెల్యేను అత్యధిక మెజార్టీతో గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో టెన్త్‌లో టాపర్‌గా నిలిచిన వారికి వార్కస్ ఎలక్ట్రిక్ స్కూటీ బహుమతిగా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు, గృహసారధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



పరుగు పోటీలో క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్–14, 16, 18 బాలబాలికలకు, అండర్–20 స్త్రీ, పురుషులకు 60, 100, 200, 300, 400, 800, 1500 మీటర్ల పరుగు పోటీలు, షాట్ పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, లాంగ్‌జంప్, హై జంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభకనబరిచిన క్రీడాకారులు ఈనెల 20 నుంచి గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీలను బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ నిర్వాహకుడు అహమర్ బాషా, వ్యాయామ సంచాలకులు బనగానపల్లె బాషా, నరేష్, లక్ష్మీ, నాగేశ్వరరావు, రాజశేఖర్, రవి, కేశవ, తదితరులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లె–కొత్తపేట సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరణ నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఈవో సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాటు చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కొండాపురం : మండలంలోని దొబ్బుడుపల్లె గ్రామ సమీపంలోని గాలిమర్రల వద్ద ఆదివారం పేకాట అడుతున్న ఆరు మందిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి 25 మద్యం బాటిళ్లు, రూ.40.000 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు పంపినట్లు కొండాపురం సీఐ వేణుగోపాల్, ఎస్ఐ మోహన్ తెలిపారు.

స్వర్ణకారుల సంక్షేమం కోసం కృషి చేస్తా



రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పఠాన్ లియాస్‌ఖాన్‌ను సన్మానిస్తున్న స్వర్ణకారులు

జమ్మలమడుగు : స్వర్ణ కారులు సంక్షేమం కోసం తమవంతు కృషి చేస్తానని స్వర్ణకారుల సంఘం పట్టణ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పఠాన్ లియాస్‌ఖాన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని స్వర్ణకారులు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం స్వర్ణకారులకు సంక్షేమ పథకాలతో పాటు నిరుపేద స్వర్ణకారుల జీవన భృతికోసం బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలు ఇప్పించి ఆదుకోవాలని సూచించారు. అనంతరం పఠాన్ లియాస్‌ఖాన్‌ను పట్టణంలోని స్వర్ణ కారులు ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణంలో స్వర్ణకారుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర న్యాయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి సత్వర న్యాయం అందేలా చూడాలని బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దూపం రాజు కోరారు. తాలూకా సీఐ పి.రాజును ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని బుడగ జంగం కాలనీలో నిరుపేదలు అధికంగా నివశిస్తున్నారని, విద్యకు దూరంగా నిరక్షరాస్యులుగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు పవన్ కల్యాణ్, జనార్దన్, బ్రహ్మయ్య, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

చేతిరాతతో సత్ఫలితాలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రతి విద్యార్థి చేతిరాత మెరుగుపరుచుకోవాలని సఖీ ఫౌండేషన్ బృందం సభ్యులు మౌనిక, రహమతున్నీసా తెలిపారు. కడప నగరంలోని ప్రకాశ్ నగర్‌లోని జీఎస్‌టీఎస్ హోంలో సఖీ ఫౌండేషన్, ఇంపాక్ట్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ ప్రోగామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి చేతి రాతతో పరీక్షల్లో అధిక మార్కులు సాధించే అవకాశం ఉందన్నారు. ఇందుకుగానూ విద్యార్థులు క్రమం తప్పకుండా సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సఖీ ఫౌండేషన్ ప్రతినిధులు సునీత, జ్యోతి, నస్రత్, ఫర్హనాజ్, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన టమూట ధర

కడప అగ్రికల్చర్: కొండెక్కి కూర్చొన్న టమూట ధర అమాంతంగా తగ్గిపోయింది. రైతు బజార్‌లో కిలో టమూట ధర రూ.10 పలుకుతోంది. రెండు నెలల కిందట రూ.100 పలకడంతో వినియోగదారులు బెంబేలెత్తి పోయారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకుని 50 శాతం రాయితీతో కొనుగోలు చేసి రైతు బజార్‌లో వినయోగదారులకు అందించాల్సి వచ్చింది. అయితే తాజాగా ధర కిలో రూ.10కి చేరింది.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆది వారం జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం జీపీఎస్ విధానాన్ని అమలుపరచడానికి ఉత్సాహం చూతోంతుందన్నారు. పాత పెన్షన్ మాత్రమే ఆమోద్యయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవికుమార్, సుజాత, నరసింహారావు, చెన్నయ్య, శ్రీనివాసులు, రమణ, చంద్ర ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు

పోస్టర్ ఆవిష్కరణ

కడప కల్చరల్: దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయంలో సేవా పక్వాడ పేరిట పోస్టర్‌ను ఆదివారం సంస్థ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి, తదితరులు ఆవిష్కరించారు. శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఆదివారం నుంచి అక్టోబర్ 2వరకు రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పట్టుపురుగుల పెంపకంతో అధిక లాభాలు



పట్టు గుడ్లను పరిశీలిస్తున్న అధికారి, రైతు

జమ్మలమడుగు : రైతులు పట్టు పురుగుల పెంపకం వల్ల మంచి ఆదాయాన్ని పొందవచ్చునని పట్టుపరిశ్రమశాఖ అధికారి రమాదేవి తెలిపారు. ఆదివారం మండలంలోని తూగుట్లపల్లిలో ఆదర్శ రైతు జయసింహారెడ్డి సాగుచేసిన పట్టు పురుగుల కేంద్రాన్ని ఆమె పరిశీలించి ఆ రైతుతో మాట్లాడారు. రైతు మాట్లాడుతూ 8 ఎకరాలలో గతేడాది మల్బరీ తోటను సాగుచేశానని, గత నెల 25వ తేదీన మూడు ఎకరాల విస్తర్ణం పొలంలో 300 పట్టు పురుగుల గుడ్లను వదిలి కేవలం 15 రోజులు మేపడం జరిగిందన్నారు. పట్టు గుడ్లను మార్కెట్‌లో అమ్మడం వల్ల లక్షా 60వేల రూపాయలు ఆదాయం వచ్చినట్లు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ అధికారి మాట్లాడుతూ రైతులు మల్బరీ తోటలను పెంచటానికి ముందుకు రావాలని సూచించారు.

పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

వేంపల్లె : పీఎం విశ్వకర్మ యోజనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ తెలిపారు. దేశప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకులతో కలిసి స్థానిక ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రూ.13వేల కోట్లతో పీఎం విశ్వకర్మ యోజనను ప్రారంభించారని, 18 రకాల చేతివృత్తుల వారికి రూ.2లక్షల వరకు రుణం మంజూరు చేస్తారని తెలిపారు. ఒక సామాన్య వ్యక్తి శ్రమిస్తే దేశాన్ని పరిపాలించవచ్చని మోదీ నిరూపించారన్నారు. ప్రపంచదేశాల్లో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు అలుపెరుగని శ్రామికునిగా పనిచేస్తున్నారన్నారు. జీ20 సమావేశాలు సమర్థవంతంగా నిర్వహించడం, చంద్రయాన్ 3తో చంద్రుని ఉపరితలంపై పరిశోధనలు, అందుబాటులోకి ఐఫోన్ 15 మేడ్ ఇన్ ఇండియా ఇలా అనేక కార్యక్రమాలతో దేశ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుస్మా , మండల అధ్యక్షులు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన టు కే రన్



టు కే రన్‌లో పాల్గొన్న కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన టు కే రన్ ఉత్సాహంగా సాగింది. స్థానిక స్పోర్ట్స్ స్కూల్ వద్ద మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డిలు ఆదివారం ఉదయం టు కే రన్‌ను ప్రారంభించారు. స్పోర్ట్స్ స్కూల్ నుంచి ప్రారంభమైన రన్ పాలకొండల వరకూ చేరింది. అక్కడ విద్యార్థులతో కలిసి శ్రమదానం చేశారు. మొక్కలు నాటి, వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా కమిషనర్, డీఎఫ్‌ఓ మాట్లాడుతూ కడపను పరిశుభ్రమైన నగరంగా తయారు చేయడానికి ప్రజలంతా నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.సుబ్బారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు సుదర్శన్‌రెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి, ఎ.బాలక్రిష్ణారెడ్డి, నగరపాలక, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వాస్తు, హస్త కళలకు ఆద్యుడు విశ్వకర్మ

కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వాస్తు, శిల్ప, హస్త కళలకు ఆద్యుడు విశ్వకర్మ అని కమలాపురం శాసన సభ్యులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం సంతోషదాయకమన్నారు. హిందూ సంప్రదాయాల ప్రకారం విశ్వకర్మను డివైన్ ఇంజినీర్‌గా పిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బారెడ్డి, మహిళా నేతలు బండి మరియ, సంధ్యారాణి, ఉమామహేశ్వరి, రత్నకుమారి, మూలే సరస్వతి, నారాయణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞ జయంతి

ప్రొద్దుటూరు : స్థానిక ఆచార్ల కాలనీలోని శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం విశ్వకర్మ యజ్ఞ జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాతం, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం విశ్వకర్మ భగవానుని గ్రామోత్సవం విరాట్ నగర్ కాలనీ పురవీధుల్లో గా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు తాలూకా విశ్వబ్రాహ్మణ సేవా సంఘం, విశ్వబ్రాహ్మణ యువజన సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బి.మఠంలో..

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో స్థానిక విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం వద్ద విశ్వకర్మ జెండా ఆవిష్కరించారు. కలశాలతో బ్రహ్మంగారిమఠం, ఈశ్వరీదేవి మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్యాక్స్ చెల్లించి బంగారు తెచ్చుకున్నాం

పోలీసులు అరెస్ట్ చేశారన్న ఆరోపణల్లో వాస్తవం లేదు



మాట్లాడుతున్న చాంద్‌బాషా

ప్రొద్దుటూరు క్రైం : తమను ఎవరూ అరెస్ట్ చేయలేదని తగు రశీదులు చూపించిన తర్వాత బంగారంతో సహా పోలీసులు తమను పంపించారని అల్‌నూర్ ట్రావెల్స్ యజమాని చాంద్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10న తనతో పాటు 20 మంది ఉమ్రా యాత్రికులు జిద్దా నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో దిగారన్నారు. అక్కడ లగేజి తనిఖీ చేసే సమయంలో తన వద్ద బంగారు గొలుసులు ఉన్న కారణంగా కస్టమ్స్ అధికారులకు రూ. 1.38 లక్షలు ట్యాక్స్ చెల్లించినట్లు ఆయన తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి బయటికి వచ్చిన బంగారు గొలుసులను తన అన్న కుమారుడికి ఇచ్చి టాయిలెట్‌కు వెళ్లినట్లు తెలిపారు. అంతలోనే ఎయిర్‌పోర్టు పోలీసులు పెద్ద మొత్తంలో బంగారు కలిగిన కర్నూలు వాసితో పాటు తన అన్న కుమారున్ని కూడా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని తెలిపారు. తాను విషయం తెలుసుకొని తన వద్ద ఉన్న కస్టమ్స్ పే రసీదు చూపించగా బంగారుతో సహా తన అన్న కుమారున్ని పోలీసులు పంపించారన్నారు. అయితే ప్రొద్దుటూరుకు వచ్చిన తర్వాత 11వ తేది నుంచి సోషల్ మీడియాలో తాను బంగారం తెస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారంటూ స్మగ్లర్లుగా ప్రచారం చేస్తున్నారని ఆయన చెప్పారు. ఇందులో వాస్తవం లేదన్నారు. 20 ఏళ్ల నుంచి ఉమ్రా, హజ్ ట్రావెల్ ఏజెంట్‌గా సేవలు అందిస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

వినాయక చవితి పండుగ సందడి



పులివెందులలో గణపతి పూజలకు కావాల్సిన పండ్లు, పూలను కొనుగోలుచేస్తున్న ప్రజలు



వల్లూరులో వినాయకుని విగ్రహాన్ని తరలిస్తున్న యువకులు

పులివెందుల టౌన్ : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పులివెందులలో గణనాథులు కొలువు తీరారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ పండుగ శోభ సంతరించుకుంది. పట్టణ ప్రజలు వినాయక చవితి పండుగ సందర్భంగా పూలంగళ్ల సర్కిల్ వద్ద బొజ్జ గణపయ్యలను కొనుగోలు చేశారు. అలాగే పండ్లు, చెరుకు గడలు, పూలు కొనుగోలు చేస్తుండటంతో సందడి వాతావరణం కనిపించింది. కొనుగోలు చేసిన గణనాథులను పల్లెలకు తరలించేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు.

ఆకాశాన్నంటిన ధరలు :

వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి పూజా సామగ్రి కొనేందుకు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పూలు, పండ్లు, పూజాసామగ్రి కొనలేని విధంగా ధరలు పలికాయి. చెరకు గడె చిన్నది రూ.20, మొక్క జొన్న కంకి ఒక్కటి రూ.20, మావి దాకులు పిడికెడు రూ.30, పండ్లు పెట్టలేని ధర, టెంకాయ రూ.40, దానిమ్మ కిలో రూ.200, అరటిపండ్లు డజను రూ.60లకుపైగా అమ్మారు. మూర పూలు రూ.50, విడిపూలు ఇష్టం వచ్చినట్లు వ్యాపారస్తులు విక్రయించారు. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు అమ్మకాలు కొనసాగించారు. దీంతో సామాన్య ప్రజలకు పండుగ భారంగా మారింది.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

వల్లూరు : వినాయక చవితి ఉత్సవాలకు మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా గ్రామాలలోని వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలను కొలువు తీర్చడానికి అవసరమైన వేదికలను, షామియానాలను ఏర్పాటు చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ కార్యక్రమాలను చేపట్టారు. కడప, ప్రొద్దుటూరు పట్టణాల నుంచి దాతల సహకారాలతో కొనుగోలు చేసిన వినాయక విగ్రహాలను ఆదివారం ఉదయం నుంచి యువకులు ఆయా గ్రామాలకు ట్రాక్టర్లు, ఆటోలలో తరలించారు. కార్యక్రమాల్లో యువకులు జై గణేష్ మహరాజ్‌కీ జై వంటి నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలలో వద్ద ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

జమ్మలమడుగు : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న గణపతి విగ్రహాల వద్ద వాడే విద్యుత్‌ను నాణ్యమైనది మాత్రమే వాడాలని విద్యుత్‌శాఖ ఏఈ రాజాబాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయకుడి గుడివద్ద అక్రమ కనెక్షన్లు వాడకుండా విద్యుత్‌శాఖ అధికారుల అనుమతితో వాడాలన్నారు. విద్యుత్ తీగలకు కనెక్షన్లు ఇచ్చే ముందు తీగలు ఎక్కడ కూడా తెగిపోయినవి వాడకుండ నాణ్యమైనటువంటి వైర్లను తగిలించుకోవాలన్నారు. గణపతి విగ్రహాలను ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఎర్పాటు చేసుకోకూడదన్నారు. విద్యుత్ స్తంభాల సపోర్టుతో వినాయక మండపాలు పెట్టుకోకూడదని సూచించారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ



మిరప పంటకు నీరు కడుతున్న రైతు



ఉల్లి సాగుకు కయ్యలు వేస్తున్న కూలీలు



ఉల్లిలో కలుపులు తీస్తున్న కూలీలు

పెద్దముడియం : పది రోజుల క్రితం పడిన వర్షానికి భూములు పదునెక్కడం, ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు వర్షం ఊరటనియ్యడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మినుము, జొన్న పంట సాగులో కొందరు రైతులు, పొలాల్లో కలుపు ఏరివేతలో మరి కొందరు, రబీ సాగుకు రసాయనిక ఎరువులు విత్తడం, మిరప పంటకు నీరు కట్టడం, గడ్డి మందు పిచికారి చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి గురువులతో పూర్వపు విద్యార్థులు

చక్రాయపేట : స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాలలో ఆదివారం 1998లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రామాంజులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు సంగిరెడ్డి, బాలనారాయణ, రామకృష్ణ, సూర్య నారాయణరెడ్డి, ఆదినారాయణ, ఖాసింబీ, ఆదినారాయణలను పూర్వపు విద్యార్థులు ఘణంగా సన్మానించారు. నాటి సోదరీమణులకు చీరలు ఇచ్చి సత్కరించారు. నాటి గురువులతో తమకు ఉన్న అనుబంధాలను తోటి మిత్రుల తీపిగుర్తులను పంచుకున్నారు. అనంతరం పూర్వవిద్యార్థులు పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో నిర్వహణకు కృషి చేసిన మను, శివరామాచారి, సుధాకర్, మునిరెడ్డిలను అభినందించారు.

ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈగా కుళాయప్ప

బద్వేలు అర్బన్ : ఏపీఎస్‌పీడీసీఎల్ బద్వేలు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎం.కుళాయప్ప ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అనంతపురం డీఈఈగా పనిచేస్తున్న ఈయనను బద్వేలు డీఈఈగా బదిలీచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి పెనుప్రమాదం

పోరుమామిళ్ల: ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి పెను ప్రమాదం ఏర్పడిందని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రంధాలయంలో పర్యావరణంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ ప్లేట్లు, కవర్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాల కోసం వాటిని తిన్న ఆవులు, గేదెలు, మేకలు అనారోగ్యంతో చనిపోతున్నాయన్నారు. అందువల్ల ప్లాస్టిక్ వినియోగం మానుకుంటే పర్యావరణం బాగుంటుందని అన్నారు.





